

రూ.100 కోట్లతో 50 నగరవనాలు

రాష్ట్రంలో రూ.100 కోట్లతో 50 నగరవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అటవీ శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. -8లో



శభాష్..పోలీస్

గుర్రంకొండ మండలంలో 32 ఏళ్ల క్రితం జరిగిన బస్సు దోపిడీ కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 303 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఆన్‌లైన్ స్కోరింగ్‌పై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ బాషా

రాయచోటి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం - ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ స్కోరింగ్‌పై పీడీలు/ పీఈటీలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాయ చోటిలో శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్‌డీఓ గౌస్ బాషా, ఎంపీడీఓ మల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఫెన్సింగ్ కోచ్ రవీంద్రనాథ్, ఏపీ పీఈటీల చీఫ్ పాట్రన్ నరసరాజు, స్కూల్ గేమ్స్ జాయింట్ సెక్రటరీ రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి ఎంపిక



రేఖ

ములకలచెరువు: కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రేఖ అనే నిరుపేద బాలిక అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఇండో నేపాల్ అండర్-19 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు పీఈటీ రేష్మ మంగళవారం తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌లో ఇటీవల జరిగిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటులో రేఖ ఏపీ జట్టులో ఆడి సత్తా చాటింది. ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది జనవరి 2 వరకు నేపాల్‌లో జరిగే వన్డే సిరీస్‌లో ఇండియా జట్టు తరఫున ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా రేఖను పాఠశాల బృందం మెమెంటోతో సత్కరించింది. దాతలు రేఖను ఆర్థికంగా ఆదుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని ఆకాంక్షించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

రామాపురం: మండలంలోని కల్పనాయినిచెరువు, గోపగుడిపల్లె గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన దెబ్బతిన్న వేరుశనగ, వరి పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వర్షాలు రాకపోవడంతో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. ఈ విషయంపై బుధవారం కేంద్ర బృందం పంటలను పరిశీలించడానికి మీ గ్రామాలకు వస్తోందని తెలిపారు. నష్టపోయిన రైతులు కేంద్ర బృందం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో ఇంకా ఏమైనా సమస్యలున్నప్పటికీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలియజేశారు.

నేడు 'నారీ చేతన'

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ కేంద్రసాహిత్య అకాడమీ సంయుక్త నిర్వహణలో 'నారీ చేతన' పేరుతో 'రాయలసీమ స్త్రీల సాహిత్యం' అన్న అంశంపై బుధవారం సింపోజియం నిర్వహిస్తున్నట్లు వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు, సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి సభ్యులు డా॥ఎం.ఎం.వి.వినోదిని తెలిపారు.

నేడు కరువు బృందం పర్యటన

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో కేంద్ర కరువు బృందం బుధవారం పర్యటించనుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తగినంత వర్షాలు లేక అనుకున్న స్థాయిలో పంటలు సాగు కాలేదు. తర్వాత కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు రాకపోవడంతో వర్షాధార పంటలు వాడిపోయి ఎండు ముఖం పట్టాయి. ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా పరిధిలో 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఆయా మండలాల పరిధిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వానికి అందించేందుకు బుధవారం జిల్లాలో కేంద్ర కరువు బృందం పరిశీలన చేయనుంది.

పర్యటన ఇలా..

బుధవారం ఉదయం 11 గంటలకు బి.కొత్తపేట మండలంలో కోటడీరు, గోర్లపల్లి గ్రామాలలో పంటల పరిశీలన, 12 గంటలకు తంబళ్లపల్లి మండలం, గుండ్లపల్లి, ఎద్దులవారిపల్లి గ్రామాలు, మధ్యాహ్నం భోజన అనంతరం 2కు గుర్రంకొండ మండలం, తరిగొండ, మర్రిపాడు గ్రామాలు, 3కు చిన్నమండెం మండలం, బోనముల, చాకిబండ గ్రామాలు, 4కు లక్కిరెడ్డిపల్లి మండలంలోని లక్కిరెడ్డిపల్లి, బి.ఎర్రగుడి గ్రామాలు, 5కు రామాపురం మండలం, గోపగుడిపల్లి, కల్పనాయినీ చెరువు గ్రామాలలో కేంద్ర బృందం పర్యటించనుంది. ఆయా ప్రాంతాలలో సాగై దెబ్బతిన్న వివిధ రకాల పంటలు, పశువులు, నీరు లేక ఒట్టిపోయిన చెరువులు, కుంటలను ఈ బృందం సభ్యులు పరిశీలించనున్నారు. పర్యటన సందర్భంగా ఆయా గ్రామాలలో రైతులతో స్థానిక పరిస్థితులపై సమీక్షలు ఉంటాయని అధికారులు తెలిపారు.

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

- సామాజిక సాధికార యాత్ర విజయవంతం
- అట్టహాసంగా కొనసాగిన ర్యాలీ
- నినాదాలతో మార్మోగిన రాజంపేట
- కిక్కిరిసిన ప్రధాన రహదారులు
- పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం





సామాజిక సాధికార యాత్రలో భారీ జనసందోహం (ఇన్‌సెట్) బస్సు యాత్రలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాజంపేట: సామాజిక చైతన్యం వెల్లివెరిసింది. రాజంపేటలో మంగళవారం చేపట్టిన సామాజిక సాధికారిత బస్సుయాత్ర జన సంద్రంగా మారింది. నియోజకవర్గంలోని సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, రాజంపేట టౌన్, మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీ ఆద్యంతం అట్టహాసంగా కొనసాగింది. మధ్యాహ్నం 2 గంటలకు పట్టణ శివార్లలోని ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, కడప మేయర్ సురేష్‌బాబు, రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితోపాటు నియోజకవర్గ ముఖ్యనేతలు బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఎర్రటి ఎండని సైతం లెక్క చేయకుండా ర్యాలీలో పది వేల మందికి పైగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదన్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, సీనియర్ న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు, వైఎస్సార్ సీపీ నేతలు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, పోలిమురళి, నడివీధి సుధాకర్, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, బీసీ, దళిత, మైనార్టీ నేతలు పసుపులేటి సుధాకర్, వడ్డె రమణ, గుల్జార్‌బాషా, విశ్వనాథ్, కలీం తోపాటు వివిధ మండలాలకు చెందిన ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దప్పుల మోత.. కేరళ వాయిద్యాలు

సామాజిక సాధికారిత యాత్ర నేపథ్యంలో కొనసాగిన ర్యాలీ దారి పొడవునా దప్పుల మోత, కేరళ వాయిద్యాలతో హోరెత్తింది. ర్యాలీలో జగనన్నకు జై కొడుతూ చేసిన నినాదాలతో పట్టణం మార్మోగింది. ప్రత్యేకించి ఈ ర్యాలీలో అధిక శాతం బీసీ, ఎస్సీ, ముస్లిం మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ కొనసాగినంత సేపు పట్టణం భారీగా బాణసంచాల శబ్దాలతో హోరెత్తిపోయింది. ఎమ్మెల్యే మేడా తనయుడు మేడా కృష్ణతేజారెడ్డి నేతృత్వంలో యువత పెద్ద ఎత్తున ర్యాలీలో జగనన్నపై అభిమానం చాటుకున్నారు. వచ్చిన జనాన్ని ఒక దశలో అదుపు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ర్యాలీ కొనసాగింది ఇలా..

ర్యాలీ యల్లమ్మగుడి నుంచి ప్రారంభమై, ఆర్టీసీ బస్టాండు, ఆర్అండ్‌బీ సర్కిల్, హెడ్‌పోస్టాఫీసు సర్కిల్, అమ్మవారిశాల, శివాలయ సర్కిల్ మీదుగా పాతబస్టాండుకు చేరుకుంది. ర్యాలీలో యువత, మహిళలు కదంతొక్కారు. ఎన్నడూ లేనిరీతిలో ర్యాలీ కొనసాగడంతో పట్టణంలోని రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఎటుచూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలతో పట్టణం వైఎస్సార్‌సీపీ మయంగా మారింది. దీంతో పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి సామాజిక సాధికారిత యాత్రకు ప్రజలు తరలివచ్చారు.

జనసంద్రం మధ్య సభ

పాతబస్టాండు (వైఎస్సార్ సర్కిల్)లో ఏర్పాటు చేసిన సామాజిక సాధికార సభ జనసంద్రం మధ్య కొనసాగింది. నాలుగు రహదారులలో జనం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీలకు చేసిన మేలును ఆసక్తిగా ఆలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సభకు ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, తొలుత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రసంగంతో సామాజిక సాధికార సభ ప్రారంభమైంది. పలువురు అతిథులను ఎమ్మెల్యే మేడా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 10 వేలకు పైగా జనం మధ్య సభ విజయవంతం అయింది. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు సామాజిక సాధికార యాత్ర రాజంపేటలో కొనసాగింది.

మహనీయులకు నివాళి

సామాజిక సాధికారిత యాత్ర ర్యాలీలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టిశ్రీరాములు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, విగ్రహాలకు నివాళులు అర్పించారు. బస్సుపై వున్న మంత్రి మేరుగ నాగార్జునతోపాటు ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రేన్ ద్వారా గజమాలతో సత్కరించారు.

పేద ప్రజల గుండెచప్పుడు జగన్



పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసే జగన్.. పేద ప్రజల గుండె చప్పుడు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 94 వేల కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. నాలుగున్నరేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమం కోసం రెండు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. రాజంపేటలో ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీనే రాష్ట్రంలో అధికారం చేపడుతుంది. అందువల్ల మళ్లీ జగనన్న సీఎం కావడానికి వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి తన గెలుపునకు సహకరించాలని సవినయంగా కోరుతున్నా.

– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

జగన్‌ను ఆదర్శంగా తీసుకున్న తెలంగాణ



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను ఆదర్శంగా తీసుకొని డిప్యూటీ సీఎం పదవిని ఎస్సీలకు కేటాయించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఐదుగురికి డిప్యూటీ సీఎం పదవులిచ్చారు. గతంలో డీసీఎంఎస్ పదవిని అగ్రవర్గాలకే కేటాయించేవారు. అయితే జగన్ రాజంపేట వాసి అయిన దళిత వర్గానికి చెందిన దండు గోపికి డీసీఎంఎస్ పదవిని ఇచ్చి దళితుల పట్ల తనకున్న ప్రత్యేకమైన అభిమానాన్ని చాటుకున్నారు. బీసీ వర్గానికి చెందిన తనను దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెన్నుతట్టి ప్రోత్సహించిన విధంగానే జగన్ కూడా తనకు పదవులిచ్చి అత్యున్నమైన గౌరవం కల్పించారు.

– సురేష్‌బాబు, మేయర్, కడప

యాదవులను గొర్రెల కాపర్లగానే చూసిన చంద్రబాబు



చంద్రబాబునాయుడు యాదవులను గొర్రెలు, బర్రెల కాపర్లగానే చూశారు. అయితే జగన్ యాదవులను శాసనసభ, శాసనమండలి ద్వారా చట్టసభల్లోకి పంపి మమ్మల్ని పాలకులుగా చేశారు. జగన్ తన కేబినెట్‌లో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్థానం కల్పించారు. గతంలో ఏ సీఎం కూడా ఇంత మంది వెనకబడిన వర్గాలకు మంత్రి పదవులు ఇచ్చిన దాఖలాలు లేవు. 53 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి వందలాది మంది బీసీలకు పదవులు ఇచ్చిన ఏకైక సీఎం జగన్.

– రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ

పేదలకు పెద్ద చదువులు



పేదల పిల్లలకు సైతం ఉచితంగా పెద్ద చదువులు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం వల్ల పేద పిల్లలు నయాపైసా ఖర్చు లేకుండా పెద్ద చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందుతున్నారు. ఈ కారణంగా లక్షలాది కుటుంబాలు పేదరికం నుంచి బయటపడ్డాయి. జగన్ మరొక అడుగు ముందుకు వేసి ఫీజురీయింబర్స్‌మెంట్‌తోపాటు జగనన్న వసతి దీవెన ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. అందువల్ల విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఏమాత్రం ఇబ్బందులు లేకుండా చదువులు కొనసాగిస్తున్నారు.

–ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్


సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం



సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమవుతుంది. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అని వెనకబడిన వర్గాల గురించి అనునిత్యం తపించే నాయకుడు జగన్. వెనకబడిన వర్గాల ప్రజలను జగన్ ఎప్పుడూ తన గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నాడు. ఎస్టీలను సైతం ప్రత్యేకంగా గుర్తించి పదవులు ఇచ్చిన ఘనత జగన్‌దే.

– అశ్వర్థనాయక్, టీటీడీ బోర్డు మెంబర్

జలం.. పుష్కలం



గండికోట ప్రాజెక్టు



అవుకు వద్ద రెండు టన్నెళ్లు పూర్తి కాగా నిర్మాణంలో ఉన్న మూడవ టన్నెల్

- అవుకు వద్ద రెండు టన్నెళ్లు పూర్తి
- మూడవ టన్నెల్ పనులు కొనసాగుతున్న వైనం
- 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు
- వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు మరింత మేలు

కడప సిటీ: రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగాన్ని ఆదుకునేందుకు అన్ని విధాలా చర్యలు చేపడుతున్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పనులపై ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేస్తూ.. క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతం అయ్యేందుకు సమీక్ష నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. గత తెలుగుదేశ ప్రభుత్వం జిల్లా ప్రాజెక్టు పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతాంగాన్ని ఆదుకోలేదన్న విమర్శలు వచ్చాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరిట వైఎస్సార్ జిల్లాలో గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని విధాల పనులు చేపట్టి ఒక నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగేలా శ్రద్ధ తీసుకున్నారు. ఇప్పుడు ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఉన్నారు. అందుకు సంబంధించి నిధులను కూడా విడుదల చేయడంతో పనులు సక్రమంగా కొనసాగుతూ వస్తున్నాయి. ఇటీవల గండికోట రెండవ టన్నెల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతం మూడవ టన్నెల్ పనులు కూడా జరుగుతున్నాయి.

గండికోటకు బీజం వేసిన వైఎస్

ఒకప్పుడు గండికోట ప్రాజెక్టుకు నీళ్లొచ్చి పరిస్థితి చాలా తక్కువ. చుట్టూ కొండలు ఉండడంతో రెండు కొండల మధ్య ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ ప్రాజెక్టుకు పెన్నా సెల్ఫ్ క్యాచ్‌మెంట్ ద్వారా మాత్రమే నీళ్లు అంతంత మాత్రంగా వచ్చి చేరేవి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాక 2004లో 11 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు నుంచి 44 వేల క్యూసెక్కులను తరలించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో అప్పట్లోనే గండికోటకు నీళ్లొచ్చేందుకు అవుకు వద్ద కొండ అడ్డు రావడంతో టన్నెల్ తవ్వి తద్వారా నీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయన హయాంలో పనులు ప్రారంభం కాగా, ఆయన మరణం తర్వాత నత్తనడకన ఎలాగోలా మొదటి టన్నెల్ నిర్మాణం పూర్తయింది. దీంతో వరద సమయంలో రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని గండికోటకు తరలించే అవకాశం కలిగింది.

జగన్ ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాక జిల్లాలో జలజీవనాడిగా ఉన్న గండికోట ప్రాజెక్టు అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగానే అందుకు సంబంధించిన పెండింగ్ పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి వేగవంతం అయ్యేలా చేశారు. అవుకు వద్ద ఈ ప్రభుత్వం వచ్చాక రెండు టన్నెళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకుగాను మొదటి టన్నెల్ 2.3 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసి రూ.75 కోట్లు ఖర్చు చేశారు. అలాగే మూడవ టన్నెల్ నిర్మాణానికి రూ.250 కోట్లు కేటాయించారు. ఇందుకు సంబంధించిన పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. అంతేకాకుండా గండికోట ఆనకట్ట పక్కన ఒక టన్నెల్‌ను కూడా ఈ ప్రభుత్వమే నిర్మించింది.


అనుబంధ ప్రాజెక్టులకు ఢోకా ఉండదు

పోతిరెడ్డిపాడు నుంచి గతంలో 44 వేల క్యూసెక్కులను తరలించే విధానం ఉండగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 80 వేల క్యూసెక్కులు జీఎన్‌ఎస్‌ఎస్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. మూడు టన్నెళ్ల ద్వారా నీళ్లు వచ్చేందుకు ఫ్లడ్ ఫ్లో కెనాల్ (వరద కాలువ)ను కూడా విస్తరించే పనులను ఈ ప్రభుత్వమే చేపట్టింది. ఈ మూడు టన్నెళ్లు పూర్తయితే వరద సమయంలో రోజుకు 30 వేల క్యూసెక్కులు గండికోటకు చేరడంతో అనుబంధ ప్రాజెక్టులైన వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టు, చిత్రావతి, పైడిపాలెం, మైలవరం తదితర ప్రాజెక్టులతోపాటు వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాకు సంబంధించి దాదాపు 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. 2020 నవంబరులో పూర్తి నీటి సామర్థ్యంతో గండికోట ప్రాజెక్టు నింపిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కింది. ప్రస్తుతం గండికోట నీటి సామర్థ్యం 26.5 టీఎంసీలు.

గండికోటకు 30 వేల క్యూసెక్కుల నీరు

వరద వచ్చిన సమయంలో గండికోట ప్రాజెక్టుకు మూడు టన్నెళ్ల ద్వారా రోజుకు దాదాపు 30 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే రెండు టన్నెళ్ల నిర్మాణం పూర్తి కాగా మూడవ టన్నెల్ నిర్మాణ పనులు త్వరలో పూర్తి కానున్నాయి. కేవలం ఈ మూడు టన్నెళ్ల ద్వారా వరద సమయంలో రోజుకు 30 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తే 25 రోజుల్లోనే గండికోట ప్రాజెక్టు నింపడంతోపాటు దాని అనుబంధ ప్రాజెక్టులను కూడా నీటితో నింపి సాగునీరు అందించే అవకాశం ఉంటుంది.

శరవేగంగా పనులు



గండికోట ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ పనులన్నీ శరవేగంగా కొనసాగుతున్నాయి. దీనికితోడు అవుకు వద్ద రెండవ టన్నెల్ కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. మూడవ టన్నెల్ పనులు జరుగుతున్నాయి.

– మల్లికార్జునరెడ్డి, ఎస్‌ఈ, జీఎన్‌ఎస్‌ఎస్, కడప

జగనన్నతోనే బలహీన వర్గాలకు భవిష్యత్తు



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ బుట్టా రేణుక

రాజంపేట: బడుగు బలహీన వర్గాల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. రాజంపేట పట్టణంలోని తోట కల్యాణ మండపంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సామాజిక విప్లవానికి తెరతీసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలచే కొనియాడబడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం, వారి ఎదుగుదల కోసం ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సమన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరగలేదన్నారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని బలోపేతం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆర్‌డీసీ స్టేట్ డైరెక్టర్ గుల్జార్‌బాష, మహిళ నేతలు అంజతమ్మ, మిరయాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువులో నారాయణరెడ్డి అనే వ్యక్తి తన ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 25 కర్ణాటక మద్యం పాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు మంగళవారం తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో రెండేళ్ల జైలు శిక్ష

పీలేరు రూరల్ : చెక్‌బౌన్స్ కేసులో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ పీలేరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పీలేరుకు చెందిన పెప్సీ చలపతి వద్ద పట్టణానికి చెందిన రాయల్ సుధాకర్ అప్పు చేశాడు. ఆ అప్పు చెల్లించడానికి చెక్కు అందజేశాడు. అయితే బ్యాంకులో తగిన మొత్తం లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. మంగళవారం జడ్జి గాయత్రి రాయల్ సుధాకర్‌కు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు



పట్టుబడిన నిందితులు, స్వామి వారి తొడుగుతో పోలీసు అధికారులు, సిబ్బంది

నందలూరు(రాజంపేట) : రైల్వేట్రాక్ పక్కన గొల్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి గుడిలో గతనెల 24వ తేదీన ఆంజనేయ స్వామి పంచలోహ తొడుగు, హుండీలోని డబ్బులను దొంగలించిన కేసులో ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసినట్లు నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. తమ సిబ్బందితో కడప- తిరుపతి హైవే రోడ్డులోని వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా షేక్ సలీమ్, తిక్కారపు హనుమంతు(బండయ్య), కోడూరు గంగయ్య, తాటిమాకుల శివకుమార్‌లు తమ సిబ్బందిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. సిబ్బంది సహాయంతో ముగ్గురిని పట్టుకోగా తాటిమాకుల శివకుమార్ పరారయ్యాడన్నారు. పట్టుబడిన వారిని విచారించగా అభయాంజనేయ స్వామి గుడిలోని స్వామివారి పంచలోహం తొడుగు, హుండీని పగులగొట్టి డబ్బులు దొంగిలించామని ఒప్పుకున్నారన్నారు. ఈమేరకు వారి వద్ద నుంచి స్వామి వారి పంచలోహ తొడుగును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇది రూ. 20, 000 చేస్తుందని ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 10వ తేదీన రాత్రి సమయంలో మహావీర్ సర్కిల్‌లో తన ఆటోను నిలుపుకుని ఉన్న ఆరోగ్యస్వామిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. అదే ప్రాంతంలో గొడవపడుతున్న గుర్తు తెలియని వ్యక్తులను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించగా అతనిపైనే దాడి చేశారు. గాయపడిన ఆటోడ్రైవర్ ఆరోగ్యస్వామి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కడప ఒన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేశారు.

రూ.100 కోట్లతో 50 నగర వనాలు

- మదనపల్లెకు మణిమకుటంగా నగరవనం
- ఫిబ్రవరి నెలాఖరులోపు పనులు పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపునకు చర్యలు
- పీసీసీఎఫ్ వై.మధుసూదనరెడ్డి



మదనపల్లె నగరవనం సందర్శనకు గుర్తుగా మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ఏపీ పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా పిల్లలకు, పెద్దలకు, వాకర్స్‌కు ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు రూ.100 కోట్లతో 50 నగరవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మదనపల్లె పర్యటనలో భాగంగా మంగళవారం పట్టణంలో ఏర్పాటవుతున్న నగరవనాన్ని పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి పరిశీలించారు. నగరవన ఏర్పాట్లు, నిర్వహణ, కల్పించాల్సిన వసతులపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నగర వనాల పథకంలో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 70శాతం వరకు నిధులు విడుదలయ్యాయని, మదనపల్లెలో మొదటి బ్యాచ్‌లో ఏర్పాటు కావాల్సినప్పటికీ కాలపరిమితి ముగిసినందున రీ వ్యాలిడేషన్‌కు రాశామన్నారు. రానున్న మూడు నెలల్లో ఫిబ్రవరి నెలాఖరులోపు పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. మొదట వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే, అవుట్‌డోర్ జిమ్ పూర్తిచేసి సంక్రాంతికి ప్రారంభించి, తర్వాత దశలవారీగా మిగిలిన పనులు పూర్తిచేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం మంజూరుచేసిన రూ.2కోట్ల నిధులతోనే కాకుండా స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో మరింత మెరుగ్గా నగరవనాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 శాతం పచ్చదనం పెంపులో భాగంగా అడవుల్లో పచ్చదనం 23శాతం ఉంటే, 7 శాతం వరకు ఆయిల్‌పామ్స్, కొబ్బరి, మామిడి తోటల రూపంలో ఉందన్నారు. మిగిలిన 3 శాతానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వన సంరక్షణసమితి ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఆధీనంలోని కామన్‌ల్యాండ్స్‌లో అగ్రోఫారెస్ట్, హార్టికల్చర్ విధానంలో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మదనపల్లె నగరవనం సందర్శనకు గుర్తుగా మొక్కను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో తిరుపతి సీసీఎఫ్ నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లా డీఎఫ్ఓ వివేక్, మదనపల్లె సబ్ డీఎఫ్ఓ ఎస్.శ్రీనివాసులు, ఎఫ్ఆర్వో కె.మదన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సుందరంగా అటవీశాఖ ప్రాంగణం

- రూ.20 లక్షలతో సందర్శకుల కోసం స్కైవాక్
- రూ.30 లక్షలతో అతిథిగృహాల నిర్మాణం
- పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి



గంగోత్రిలో ఏర్పాటు చేసిన ట్రీవాక్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక అమలు చేస్తున్నట్లు అటవీశాఖ పీసీసీఎఫ్ వై.మధుసూదనరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పలువురు ఉన్నతాధికారులతో కలిసి హార్సిలీహిల్స్ అడవి, కొండ పైఅంచున ఉన్న అటవీహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా పరిశీలనలు జరిపారు. కొండపై కృష్ణ టెంపుల్, పోలీస్ క్వార్టర్స్ వెనుక కొండ ప్రాంతం, గంగోత్రి వద్ద కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పరిశీలన చేశారు. కొండపై నెలకొన్న పరిస్థితులను పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ సందర్శకుల వినోదం కోసం పలు కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. రూ.20 లక్షలతో అటవీ ప్రాంగణ ప్రవేశద్వారం నుంచి మానస సరోవం వరకు చెట్లపై నుంచి నడుచుకుంటూ వచ్చేలా స్కై వాక్ ఏర్పాటు చేస్తామన్నారు. సందర్శకులకు అందుబాటులో ఉండేలా రూ.30 లక్షలతో కొత్తగా అతిథిగృహాలను అందుబాటులోకి తెచ్చేందుకు పాత భవనాన్ని ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. గంగోత్రి చెరువు వెనుక వైపు పడిపోయిన చెట్టుపై వాక్ బ్రిడ్జిని ఏర్పాటు చేశామని, దీన్ని మరింత పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. మానస సరోవరంలో బోటులో పర్యటించిన ఆయన సందర్శకుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఆయన వెంట తిరుపతి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు, రాజంపేట డీఎఫ్ఓ పళని వివేక్, స్క్వాడ్ డీఎఫ్ఓ జీవీ సుబ్బారెడ్డి, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, బీటు అధికారి జయరాం పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

మృతుడు మదనపల్లెకు చెందిన హెరిటేజ్ ఉద్యోగి



ఉరివేసుకుని మృతి చెందిన చైతన్యకుమార్

నిమ్మనపల్లె : కుటుంబ సమస్యలు, పోలీస్ కేసులు, తల్లి అనారోగ్యం, వెరసి తీవ్ర మనస్తాపం ఓ వ్యక్తిని ఆత్మహత్య చేసుకునేలా చేశాయి. సోమవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు... మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ ఆరోగ్యవరం పుదికోటకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్. టి.పెద్దిరెడ్డి, రెండోభార్య కుమారి దంపతుల కుమారుడు టి.చైతన్యకుమార్(33) పన్నెండేళ్లుగా గోపాలమిత్రగా పనిచేశాడు. ప్రస్తుతం చిత్తూరు హెరిటేజ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సెలవురోజుల్లో ఇంటికి వచ్చి తల్లి అనారోగ్యానికి చికిత్స చేయిస్తున్నాడు. కాగా చైతన్యకుమార్‌కు ఏడేళ్ల క్రితం కొక్కంటి క్రాస్‌కు చెందిన సంతోషితో వివాహమైంది. ఆమెకు పిల్లలు లేకపోవడంతో రెండేళ్లక్రితం మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీలక్ష్మిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి జెస్సీ(6నెలలు) కుమార్తె ఉంది. ఈ క్రమంలో మొదటిభార్య సంతోషితో విభేదాలు వచ్చాయి. దీంతో ఆమె భర్తను వదిలి వెళ్లిపోయింది. బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేసింది. పలుమార్లు బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో పంచాయితీలు జరిగాయి. ఓ వైపు తల్లి అనారోగ్యం, మరోవైపు పోలీస్‌కేసు, విధి నిర్వహణలో ఇబ్బందులు, కుటుంబ సమస్యలు అతడిని తీవ్రమనస్తాపానికి గురిచేశాయి. ఈక్రమంలో సోమవారం బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చింది. దీంతో ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన చైతన్యకుమార్ బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పాడు. వాల్మీకిపురం-నిమ్మనపల్లె మార్గంలోని కొండయ్యగారిపల్లె మార్గం సత్రం వద్ద రోడ్డు పక్కన ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం సాయంత్రం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన గొర్రెలు, పశువుల కాపరులు నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రాత్రి అటవీప్రాంతంలోకి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి టి.పెద్దిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

శభాష్.. పోలీస్!

32 ఏళ్ల తరువాత బస్సుదోపిడీ కేసులో నిందితుని అరెస్ట్



నిందితుడు వెంకటరమణనాయుడును అరెస్ట్ చేసిన పోలీసులు

గుర్రంకొండ : గుర్రంకొండ మండలంలో 32 ఏళ్ల క్రితం జరిగిన బస్సుదోపిడీ కేసులో తప్పించు తిరుగుతున్న నిందితుడు కె. వెంకటరమణనాయుడు(52)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 1992 సంవత్సరం ఫిబ్రవరి నెల 15న ఎస్‌వీటీ ప్రైవేట్ బస్సు బెంగళూరు నుంచి కడపకు బయలుదేరింది. మార్గమధ్యంలో కోన క్రాస్ వద్ద ఆరుగురు దోపిడీ ముఠా సభ్యులు కత్తులతో బస్సులోని ప్రయాణికులపై దాడి చేశారు. అందరిని బెదిరించి వారి వద్ద నుంచి బంగారు నగలు, రిస్ట్‌వాచీలు రూ.47 నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన అప్పట్లో పెద్ద సంచలనం కలిగించింది. ఈ కేసుకు సంబంధించి రాయచోటికి చెందిన సుధాకర్ రాజు(24), మదనపల్లెకు చెందిన శేఖర్‌రెడ్డి(22), ఈశ్వర్‌రెడ్డి(23), కురబలకోట మండలం రామిగానిపల్లెకు చెందిన బి.రాజారెడ్డి(21), బి. ఆనంద్(22), ఇదేమండలం సిద్దంవారిపల్లెకు చెందిన కె.వెంకటరమణనాయుడు(22)లపై పోలీసులు కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారు కొద్దిరోజుల తరువాత బెయిల్‌పై వచ్చి కేసు కోర్టులో నడిపించారు. 1994లో కోర్టులో నేరం రుజువు కావడంతో సుధాకర్‌రాజు, శేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఆనంద్‌లకు జడ్జి ఆరునెలల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసులో రాజారెడ్డిని నిరపరాధిగా భావించి విడిచిపెట్టారు. అయితే ఈ కేసులో ఏ5 నిందితుడిగా ఉన్న వెంకటరమణనాయడు బెయిల్‌పై బయటకు వచ్చి తరువాత కేసు విచారణ కోసం కోర్టుకు హాజరుకాలేదు. ఇలా 32 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో స్పెషల్ పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజులుగా ఈ బృందం బెంగళూరులో మకాం వేసి చాకచక్యంగా నిందితుడు వెంకట్రమణ నాయడును అరెస్ట్ చేసి మంగళవారం వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ దిలీప్‌కుమార్, ఏఎస్ఐ మోసెస్, హెడ్‌కానిస్టేబుల్ కత్తి వేణు, జిల్లా టెక్నికల్ వింగ్ హెడ్‌కానిస్టేబుల్ రవిశేఖర్‌లను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

నవశకం

సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన బోధన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధిలో భాగంగా అందిస్తున్న సాంకేతిక పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి, కంప్యూటర్లు, ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా బోధన అందిస్తుంటే సంతోషంగా ఉంది. దీనివలన విద్యార్థులకు తెలివితేటలు పెరుగుతాయి.

– అద్దూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు, రైల్వేకోడూరు

సొంతిల్లు వచ్చింది



ఏళ్ల తరబడి పీలేరు పట్టణంలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాము. మా భర్త ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సొంతిల్లు కోసం గతంలో పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. అయితే జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి కోసం గ్రామ వలంటీర్ ద్వారా అర్జీ పెట్టుకోగానే మంజూరైంది. సొంతింటి కల నెరవేర్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– గాయత్రి, పీలేరు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన విజయచంద్ర

నిమ్మనపల్లె : ఓ మానసిక రోగి నీటిగుంతలో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన కొలిమి నాగేశ్వరరావు కుమారుడు కొలిమి విజయచంద్ర(48)కు నిమ్మనపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వెంకటమ్మ అలియాస్ ప్రసన్నతో 12ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె జాస్మిన్‌లిల్లీ, కుమారుడు సోహాన్ ఉన్నారు. విజయచంద్ర చౌడేపల్లె పోస్టుఆఫీస్‌లో పనిచేసేవాడు. దీనికితోడు మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఐదేళ్లక్రితం మానసిక సమస్యలతో అనారోగ్యానికి గురయ్యాడు. ఇదే కారణంతో మూడునెలల క్రితం ఉద్యోగం పోగొట్టుకున్నాడు. మానసిక అనారోగ్యానికి తిరుపతిలో వైద్యచికిత్స పొందుతున్నాడు. సోమవారం తిరుపతికి వెళ్లి వైద్యచికిత్స పొంది రాత్రి నిమ్మనపల్లె పంచాయతీ కొత్తపల్లెకు వచ్చాడు. మంగళవారం ఉదయం విజయచంద్ర నిమ్మనపల్లె గ్రామంలోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే నిమ్మనపల్లెకు సమీపంలోని అగ్రహారంరోడ్డు బ్రిడ్జి నిర్మాణం వద్ద, బాహుదా వరదనీటి ఏటిలోని గుంతలో పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు మధ్యాహ్నం గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం మృతుడిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మద్యం మత్తులో నీటిగుంతవద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గతంలోనూ అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

14న కలెక్టరేట్ ఎదుట ధర్నా



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలో కరువు, తుపాను బాధితులను ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీనేతల ఆధ్వర్యంలో కరువు, తుపాను బాధితులను ఆదుకోవడం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో సాగైన ఉద్యాన పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. రైతులు నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ.40వేలు, వాణిజ్య పంటలకు రూ.75వేలు, ఉద్యాన పంటలకు రూ.1లక్ష చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కరువు మండలాల విద్యార్థులకు అన్నిరకాల ఫీజులను వెంటనే రద్దుచేయాలన్నారు. తుపాను, కరువు నివారణ చర్యలను చేపట్టడంలో పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 14వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ నాయకులు మన్సూర్, నాగేశ్వరనాయుడు, యుగంధర్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తోపు క్రిష్ణప్ప, రైతుసంఘం జిల్లా నాయకులు శివరామక్రిష్ణ, వంగిమళ్ల రంగారెడ్డి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి దుర్మరణం

బద్వేలు అర్బన్ : బద్వేలు మండలం, కోనసముద్రం పంచాయతీ ఎల్లుగారిపల్లె గ్రామంలో మంగళవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎల్లుగారిపల్లె గ్రామానికి చెందిన జయపాల్, మరియమ్మలకు ముగ్గురు కుమారులు కాగా వారిలో పెద్దవాడైన మూర విజయ్‌కుమార్ (26) పట్టణంలోని మెడ్‌ప్లస్ మెడికల్ షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండేవాడు. ఇతనికి ఏడాదిన్నర క్రితం చంద్రకళ అనే యువతితో వివాహం కాగా 5 నెలల కుమారుడు ఉన్నాడు. విజయ్‌కుమార్ ఖాళీ సమయంలో తన పొలంలో వ్యవసాయ పనులకు కూడా వెళుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తన చిన్నాన్న అయిన మూరప్రసాద్, అబ్బ అయిన లూకయ్యలతో కలిసి పొలానికి నీరు కట్టేందుకు వెళ్లాడు. పొలం వద్ద నీరు కట్టేందుకు ఇనుప పైపులు సిద్ధం చేస్తున్న క్రమంలో సమీపంలో ఉన్న 11 కె.వి. విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వారి బంధువులు ముగ్గురిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా విజయ్‌కుమార్ అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. లూకయ్యకు స్వల్ప గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. అలాగే పెళ్లయిన ఏడాదిన్నరకే భర్త మృతి చెందడంతో భార్య గుండెలవిసేలా రోదించింది. ఎల్లుగారిపల్లె గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అల్లాడుపల్లెలో ..

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం వద్ద మంగళవారం సోమా మార్కండేయ(57) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. సోమవారం రాత్రి దేవాలయం వద్ద యాచకులతో కలసి మార్కండేయ నిద్రించగా ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బద్వేలు మండలం తిరువెంగళాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హోరా హోరీగా హాకీ అంతర్ జిల్లా పోటీలు



ఫైనల్స్‌కు చేరిన చిత్తూరు బాలుర జట్టు



ఫైనల్స్‌కు చేరిన చిత్తూరు బాలికల జట్టు



ఫైనల్స్‌కు చేరిన కడప బాలికల జట్టు



ఫైర్ క్యాంపులో క్రీడాకారులు

- బాలుర విభాగంలో ఫైనల్స్‌కు చేరిన చిత్తూరు, కడప
- బాలికల విభాగంలో ఫైనల్స్‌కు చేరిన కడప, విశాఖపట్నం

మదనపల్లె సిటీ : స్థానిక బీటీ కాలేజీ మైదానంలో 67వ అండర్-14 అంతర జిల్లా హాకీ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. బాలికల విభాగంలో సెమీ ఫైనల్స్‌లో కడప- తూర్పుగోదావరి జట్లు పోటీ పడగా కడప 5 గోల్స్ చేసి సెమీ ఫైనల్స్‌కు చేరింది. రెండో సెమీ ఫైనల్స్‌లో విశాఖపట్నం-అనంతపురం జట్లు పోటీపడగా 1-0 స్కోరుతో విశాఖపట్నం విజయం సాధించింది. దీంతో బాలికల విభాగంలో కడప, విశాఖపట్నంలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో సెమీ ఫైనల్స్‌లో కడప- అనంతపురం జట్లు పోటీపడగా 2-0 స్కోరుతో కడప జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు- విశాఖపట్నం పోటీపడగా 2--0 స్కోరుతో చిత్తూరు ఫైనల్స్‌కు చేరుకుంది. పోటీలు ఉదయం నుంచి రసవత్తరంగా జరిగాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, పీడీలు శ్రీనివాసులు, రమేష్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామ, పలువురు పీడీలు పాల్గొన్నారు. బుధవారం ఫైనల్స్ జరుగుతాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు.

ఉల్లాసంగా ఫైర్ క్యాంపు

అంతర్ జిల్లా హాకీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో స్థానిక బీటీ కాలేజ్ క్రీడామైదానంలో ఫైర్ క్యాంపు జరిగింది. కట్టెలతో మంటలు వేసి ఉల్లాసంగా, ఉత్సాహంగా పాటలు పాడారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

డ్రైనేజి కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మదూరు డ్రైనేజి కాలువలో పడి తుమ్మల సుధాకర్‌రెడ్డి (37) అనే వ్యక్తి మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ప్రొద్దుటూరులోని బుడ్డాయపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి బేల్దారి పనికి వెళ్లేవాడు. అతనికి ఇంకా పెళ్లి కాలేదు. ఇటీవల సుధాకర్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. అతను పనికి వెళ్తున్నానని చెప్పి సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం సమయంలో మదూరు కాలువ వద్ద మద్యం మత్తులో అతను తూలుతూ కనిపించాడని స్థానికులు తెలిపారు. అయితే రాత్రి పొద్దుపోయినా సుధాకర్‌రెడ్డి ఇంటికి రాలేదు. ఈ క్రమంలో సాయంత్రం మదూరు కాలువలో ఒక మృతదేహం ఉండటాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. త్రీ టౌన్ సీఐ వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడు సుధాకర్‌రెడ్డిగా నిర్ధారించారు. మద్యం మత్తులో అతను ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.